# శ్రీ రమణ జ్యోతి

సంపుటి-44 సంచిక - 3 హైదరాబాదు మార్చి, 2024 పేజీలు - 52 రూ. 10/- సంవత్సర చందా : రూ. 100/-

# SRI RAMANA JYOTHI

Vol - 44 Issue - 3 Hyderabad March, 2024 Pages - 52 Rs. 10/- Annual Subscription Rs. 100/-



BHAGAVAN SRI RAMANA MAHARSHI



ARUNACHALA HILL (అరుణాచల గిరి)

స్మరణమా త్రముననె పరముక్తి ఫలద । కరుణామృ తజలధి యరుణాచ లమిది ॥

శ్రీ రమణ జ్యోతి

మార్చి 2024

ఈ సంచికలో ...

**Sri Ramana Jyothi**

March 2024

IN THIS ISSUE ...


| | | | |
|---|---|---|---|
| **1.** | **డా॥ కే.యస్. గారి 116వ ప్రవచనం** | డా॥ వి. రామదాస్ మూర్తి | 3 |
| **2.** | **శ్రీ భగవాన్ నా జీవితంలోకి ఎలా ప్రవేశించారు?** | శ్రీ వై.ఎన్. అథావలె | 8 |
| **3.** | **ఉద్దీపనము** | శ్రీ దుర్గా శ్యామసుందరి | 15 |
| **4.** | **గణపతిని రక్షించిన భైరవి** | శ్రీమతి అయ్యల సోమయాజుల రేణుక | 21 |
| **5.** | **శ్రీ రమణ మహర్షి భక్తాగ్రేసరులు** | శ్రీమతి మల్లాది ఫణిమాల | 26 |
| 6. | Why did God Choose Prabhupada and Vivekananda? | Dr K Subrahmanian | 30 |
| 7. | Ashtavakra Gita 22 | V Krithivasan | 37 |
| 8. | Atma Vichara Padhigam | | 41 |
| 9. | Life in the Hall at Sri Ramanasramam | SS Cohen | 44 |
| 10. | Inattention - An Obstacle to the Divine | Venkata Ramana | 47 |
| 11. | In Him I find Responce | B.S. Bagi | 51 |


**Events in Sri Ramana Kendram in March 2024**

1. Satsang - Every Sunday - 9.00 - 10.45 a.m.
2. 19th - Punarvasu Satsang - 6.30 - 7.30 p.m.
3. 3rd Sunday - Meditation - 9.00 - 10.45 a.m.

(పాఠకులు దయచేసి తమ ఫోన్ నంబరు,e- మెయిల్ అడ్రెస్, శ్రీ రమణకేంద్రం ఆఫీసుకు వెంటనే ఫోన్ చేయగలరు)

(Readers are requested to kindly intimate the Sri Ramana Kendram Office, their Phone Number and e-mail address)

© Copyrights of all the material used from Sri Ramanasramam publications in Sri Ramana Jyothi either in excerpted form, translated form or serialised form totally belong to Sri Ramanasramam, Tiruvannamalai.

**శ్రీ రమణజ్యోతి వ్యవస్థాపకులు: కీ॥శే॥ డా॥ కె. సుబ్రహ్మణియన్**
**(వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీరమణకేంద్రం)**

# ఒత్తిడి, నివారణ

డా॥ కే.యస్. గారి 116వ ప్రవచనం

అనువాదం: డా॥ వి. రామదాస్ మూర్తి

మీరు దేవాలయానికి వెళ్ళినప్పుడు, అర్చకుడు దైవ సన్నిధిలో కొబ్బరికాయ కొట్టి, పూజ చేసి, అరటిపండో మరేదో యిస్తాడు. అలా యిచ్చిన వెంటనే దానిని ప్రసాదం అంటాము. ఎప్పుడైనా రోడ్డు వెంబడి మీరు వెళ్తూ, ఒక దగ్గరి స్నేహితుడు కనిపిస్తే "నేను యిప్పుడే అరటిపళ్ళను కొన్నాను, కొన్ని తీసుకో" అంటే, అతను యింట్లో బోలెడు పళ్ళు వున్నాయని తీసుకోడు.

అదే, మరెప్పుడైనా తారసిల్లిన పరిచయస్తుడికి "నేను తిరుపతి వెళ్ళి వచ్చాను", అని ఒక చిన్న లడ్డు ముక్కను యిస్తే, అతడు ధనవంతుడైనా సరే, వెంటనే తీసుకుంటాడు. అప్పుడు, పరిమాణంతో సంబంధం లేకుండ, దాన్ని దేవుడు యిచ్చాడని భావిస్తూ వెంటనే తీసుకుంటాడు. సాధారణంగా తీసుకోని వ్యక్తి కూడా, ప్రసాదమనుకున్న దాన్ని పవిత్రమైనదని తీసుకుంటాడు. ప్రసాదమనే సరికి ప్రవర్తనలో మార్పు వస్తుంది. ప్రతి ఒక్కటి, నిజానికి దేవుడి నుండి వచ్చినదే, ఏదీ మనది కాదు.

శ్రీకృష్ణుడు, పత్రం, పుష్పం, ఫలం, తోయం, ఏది సమర్పించినా చాలు, పెద్ద బుట్టెడు పుష్పాలు, పళ్ళు అవసరం లేదు, ఇచ్చేది నామ మాత్రంగా వుంటే చాలునన్నాడు. ఒక చిన్న బిడ్డ, జిలేబి ముక్కను తెచ్చి మీకు యిస్తే ఎంతో సంతోషిస్తారు. అంతేగాని, తీసుకోకుండ లోపలికి వెళ్ళి పెద్దది తెచ్చుకుంటానని అనరు. బిడ్డ

యిస్తున్న దాని పరిమాణాన్ని లెక్కలోకి తీసుకోము. బిడ్డ తృప్తి చెందుతుంది, మీరు సంతోషిస్తారు. అలాగే, దేవుడు కూడా, యిన్ని వ్యాపకాల మధ్య మీరు భక్తితో సమర్పించిన దానితో ఎంతో సంతోషిస్తాడు. అలాగే వేంకటేశ్వర స్వామి హుండీలో వేల రూపాయలు వేసినప్పటికీ, అది నామ మాత్రమే. ఎందుకంటే, భగవంతుడు యిచ్చిన దానిలో నుండి మనం తిరిగి సమర్పించు కుంటున్నాము కదా! తిరిగి మళ్ళీ ఏమీ ఆశించకుండా, మనకు వున్న దానిలో కొంత మనకు తెలియని వాళ్ళకు కూడ యిస్తూ వుండాలి.

## ఇస్తే యివ్వండి

ఒక యాచకుడు మన యింటి దగ్గరికి వచ్చినప్పుడు, సాధారణంగా "బాగా బలంగానే వున్నావు కదా, ఏదో ఒక పని ఎందుకు చేసుకోవు" అంటాము. ఏమీ యిచ్చేందుకు అతను తగడు అనుకుంటాము. కాని, మనకు అనుకోకుండ ఏదో ధనం వస్తే, మనం దానికి తగుదుమా అని అనుకోము. అడగడానికి వచ్చాడంటే, అతనికి ఏవో సమస్యలు వుండవచ్చు. మనం ఏమీ యివ్వనప్పటికీ, అతనిని విమర్శించరాదు. ఏవో బాధలతో, ఒక పది రూపాయలు యివ్వమని అడగవచ్చు. అలా అడగడానికి ఎంతో మానసిక బాధ వుండి వుండవచ్చు. మనం యివ్వగలిగిన స్థితిలో వుంటే యివ్వడం సబబు. దీనస్థితిలో వున్న వ్యక్తి, మనం డబ్బును విసిరివేసినా తీసుకుంటాడు. కాని, వ్యక్తి స్థితిని గమనించి, కొంత మర్యాద చూపాలి. అలాగే, పరిచయమున్న వ్యక్తి యింట్లోకి వచ్చి

సహాయం కోరినప్పుడు, యివ్వగలిగితే, అప్పుడు యితరుల సమక్షంలో కాకుండ, వేరుగా వెళ్ళి యివ్వడం మర్యాద. సహాయం పొందినవారు దీవిస్తే, దాని ప్రభావం ఎంతైనా వుంటుంది.

ఆలోచనల శక్తి, ప్రభావాలు ఎంతో గొప్పగా వుంటాయి. ఒక మంచి వ్యక్తి మన గురించి ఆలోచిస్తే, లేదా ఒక పవిత్రమైన సాధువు దృష్టి మన మీద పడితే, అది ఎంతో ఊహించలేనంత ప్రభావాన్ని చూపుతుంది. అది అప్పటికప్పుడు కాకపోయినా గాని, ఏదో మరికొంత కాలానికైనా శాంతిని యివ్వగలుగుతుంది. అది శ్రేయోభిలాషులే కాదు, యాచకుల నుండి కావచ్చు. అందుకే, స్వామి వివేకానంద, హిమాలయ గుహలో వున్న ఎవరో మహాత్ముని నుండి వెలువడిన సదాలోచన, భూమిపై నున్న అందరి మీద మంచిని చేస్తుందన్నారు. అందరి పట్ల సద్భావన చూపితే, వారిలో అదే భావన ఏర్పడుతుంది.

ఒక భక్తుడు, పనికి సంబంధించిన ఒత్తిడిని గురించి నన్ను అడిగాడు. ఈ ప్రపంచంలో ఏదీ అప్పటికప్పుడు తటాలున జరగదు. మన ఎఱుకలోకి రాకుండ, మన చుట్టూ ఎన్నో జరుగుతాయి. అవి అన్నీ, ఆ ఉన్నత శక్తి యిచ్ఛతో జరుగుతూ పోతాయి. ఇప్పుడు మనం ఒత్తిడిని గురించి మాట్లాడుతున్నాము. ఇదే సమయంలో, అకస్మాత్తుగా, మీలో ఒత్తిడి ఏమీ లేదని అనిపించవచ్చు. అలాగే, కొన్ని ఏళ్ళ తరువాత, పనిలో వుంటూ వచ్చిన ఒత్తిడీ లేకపోవచ్చు.

**ఒత్తిడి అవసరమా?**

నిజం చెప్పాలంటే, కొంత ఒత్తిడి అవసరమే. ఎవరూ, అసలు

ఒత్తిడి లేకుండ పని చేయలేరు. ఉదాహరణకు, ఒక తాడులో ఒత్తిడి (పురి) వుండాలి, లేకుంటే అది ఉపయోగపడదు. అందుకే, వాంఛిత ఒత్తిడి, అవాంఛిత ఒత్తిడి అన్నవి వుంటాయి. వాంఛిత ఒత్తిడి, పని చేసేందుకు అందరికీ కావాలి. అవాంఛితమైతే, ఒత్తిడి పనికి అడ్డు తగులుతుంది. వాంఛిత ఒత్తిడి పనిని ప్రోత్సహిస్తే, అవాంఛితమైన వ్యతిరేక ధోరణితో మీరు ఆ పని చేస్తున్నప్పటికీ, అది ఫలవంతమవుతుందా, కాదా అన్న సంశయాన్ని రేకెత్తిస్తుంది. దానితో, ఎంతో శక్తి ఆ ఊహతో వృథా అవుతుంది.

అందుకే, మొదటే, ఆ పని విజయవంతమవుతుందా లేదా అన్న శంక లేకుండ ముందుకు పోతే, మనలోని శక్తి మొత్తం ఆ పనికి ఉపయోగపడుతుంది. అంతే కాదు, ఆ పనిని పూర్తి చేసిన తరువాత మీకు అలసట అనిపించదు. పనివల్ల అలసట అన్నది, మొదటి నుండి ఆ పని చక్కగా అవుతుందో లేదో అని భయపడడం వల్ల కలుగుతుంది. ఉదాహరణకు, తనలో నుండి నీరు ప్రవహించే ఒక నీటి కొళాయి, దానిలో నుండి తక్కువ నీరు ప్రవహిస్తే, అది బాధపడదు. అలాగే, ఎక్కువ నీరు ప్రవహించినప్పటికీ, ఆనంద పడదు. అసలు కొళాయి యొక్క పని ఏమిటి? తన గుండా నీటిని ప్రవహింప జేయడమే. నీటి ప్రవాహం ఎక్కువ లేదా తక్కువ అన్న దానితో దానికి సంబంధం లేదు. మనం కూడా, అలాంటి ధోరణిని అవలంబిస్తే, భగవంతుడు ఏమి చేయమని ఆదేశిస్తాడో, నేను దానికి పని ముట్టుగా వుంటాను అని తెలుస్తుంది. పని ఎక్కువైనా, తక్కువైనా, తృప్తి లేదా అసంతృప్తులు వుండవు. అది ఒక ఉన్నత స్థితి.

## విమర్శకులకు కొదవ లేదు

మరొక విషయం. నీవు ఏమి చేసినప్పటికీ, నిన్ను విమర్శించడానికి ఎవరో ఒకరు వుంటారు. వాటిని పట్టించుకో నక్కర లేదు. నీవు ఆలోచించి చూస్తే, ఎన్నో కోట్ల ప్రజలు వున్న ఈ ప్రపంచంలో, ఎందరు నీకు బాగా తెలిసిన వాళ్ళు వున్నారు? ఐదారుమంది కావచ్చు.

వివాహమైన నలభై ఏళ్ళ తరువాత కూడ, కోపం వచ్చినప్పుడు, "అసలు నిన్ను ఎందుకు పెళ్ళి చేసుకున్నానో తెలియదు" అనే వాళ్ళు వున్నారు. అంటే, ఇంకొక వ్యక్తిని పూర్తిగా అర్థం చేసుకోలేదన్న మాట. ఎందుకంటే, నిన్ను నీవే పూర్తిగా తెలుసుకోలేదు. ఏదో ఒక సందర్భంలో, నేను యిలా చేయబోతున్నానని, నాకు నేను చెప్పుకోగలనా? నిజంగా అలాంటి సందర్భం వస్తే, నేను ఏమి చేయబోతానో, నాకే తెలియదు. యాంత్రికంగా, అప్పటికప్పుడు ఏదో మాట్లాడతాము, ఏదో ఒకటి చేస్తాం. దాదాపు, ప్రతి రోజూ, అలాగ చెప్పి వుండకూడదు, లేదా చేసి వుండకూడదని ఆ తరువాత అనుకుంటాం. మనకే తెలియక చేయడం వల్ల, అలాగ అవుతుంది.

ధ్యానం, పూజ, జపం చేస్తుండడం వల్ల, మనం అన్ని పనులు అవగాహనతో చేయగలుగుతాం. ఆలోచనా రహితంగా ఏమీ చేయం. ఇతరులను దృష్టిలో పెట్టుకుని నడుచుకుంటాం. అందుకే, మన విధులను, చక్కగా, శక్తి మేర నిర్వహించాలి. అప్పుడే, శ్రమను కలిగించే పనిలో కూడా శాంతిని చవి చూస్తాం. అది ఆ భగవంతుడే ప్రసాదించాలి. సత్సంగం, దేవాలయ దర్శనాలు, సాధువులను దర్శించుకొనడం మంచిది. వాటి వల్ల, మనసులు పవిత్రమై, అవసరమైన శాంతి లభిస్తుంది.

# శ్రీ భగవాన్ నా జీవితంలోకి ఎలా ప్రవేశించారు

శ్రీ వై.ఎన్. అథావలె (భావురావ్)

1942లో శ్రీ భగవాన్ యొక్క ప్రథమ దర్శనం కాక మునుపు, నేను ఒక సాంప్రదాయక మరియు ఆధ్యాత్మిక వాతావరణం కలిగిన కుటుంబంలో పెరగసాగాను. 1914 నుండి, నేను మహారాష్ట్ర లోని పూణే నగరానికి దగ్గరలోని ఆలంది లో వున్న సంత్ జ్ఞానేశ్వర్ సమాధిని దర్శించుకుంటూ వున్నాను. 90 సంవత్సరాల క్రితం, ఆలందిలో ఆత్మ సాక్షాత్కారము పొందిన స్వామి నరసింహ సరస్వతి అనే గొప్ప సాధువు మరియు యోగి వుండేవారు. మా తాత గారు, వారికి గొప్ప విధేయుడైన భక్తుడు. స్వామి వారి అనుగ్రహం, మా కుటుంబం మీద అప్పటి నుండి వున్నది. నేను పుట్టక మునుపే, స్వామి వారు శరీరాన్ని వదిలి సమాధిని పొందినా, వారి నిర్వాణం తరువాత కూడా, ఎంతోమంది భక్తులకు వారిని దర్శించుకునే అదృష్టం కలిగింది అని నాకు బాగా తెలుసు. అలాగే, నేను కూడా, చర్మ మాంసాదులతో వారిని దర్శనం చేసుకోవాలని, ఎన్నో సంవత్సరాలు భక్తితో ప్రార్థించాను. ఎన్నో అనుగ్రహపూర్వకమైన సంఘటనలు మా కుటుంబంలో జరిగినా, నాకు మాత్రము, వారి దర్శనం కలుగలేదే అనే అసంతృప్తి వున్నది. ఇంకా చెప్పాలంటే, నాకు వారి దర్శనం కలగాలని పట్టుబట్టాను. స్వప్నంలో వారు దర్శనమిచ్చినా నాకు తృప్తి లేదు. అందువల్ల, నేను వారిని మధ్య మధ్యలో, దర్శనం కలుగజేయమని ప్రార్థిస్తూనే వున్నాను.

1939 నుండి 1942 వరకు సయాటికా తో బాధ పడ్డాను.

దానికి కారణం, నా ఇంజనీరింగ్ పనిలో కలిగిన అధిక శ్రమ. దాని వలన నేను చాలా బలహీన పడ్డాను. ఈ స్థితిలో, వయసు మళ్ళిన నా తండ్రికి నేను భారం కాకూడదని, నా ఈ స్థితికి దుఃఖిస్తూ, పూణేకు 50 మైళ్ళ దూరంలో, కృష్ణా నదికి ఒడ్డున వున్న పవిత్ర స్థలమైన వాయికి వెళ్లాను. అప్పుడు కూడా, ఆలందిలో వున్న స్వామి దర్శనం కలగాలని ప్రార్థించే వాడిని. నా ప్రార్థనను మన్నించక పోవటం వలన, మరియు నా ఆరోగ్యం బాగోలేక పోవటం వలన, నా ప్రార్థనలో కొంత మార్పు చేసి, నేను చనిపోయేలోపల నాకు ఒక మహాత్ముని దర్శనం కలుగజేయమని మొరపెట్టుకున్నాను. అలా ప్రార్థించిన దాదాపు ఒక నెల తరువాత కావచ్చు, 1942 ఫిబ్రవరిలో, నేను పూర్తిగా నిరాశలో కూరుకొని పోయినప్పుడు, ఒక గొప్ప స్పష్టమైన దర్శనం, తెల్లవారుతుండగా, స్వప్నంలో కలిగింది.

ఒక కొండ గుహలో, గొప్ప మహాత్ముడు వున్నాడు. వారి మాటలను వినటానికి, వివిధ మతాలకు చెందిన వారు, వివిధ కులాలకు చెందిన వారు, సన్న్యాసులు, యోగులు మరియు గృహస్థులు, గుంపులు గుంపులుగా, కొండ మీద వున్న గుహ వద్దకు అనేకమంది వెళ్తున్నారు. అలా వెళ్ళే వారిలో నేనూ ఒకణ్ణి. ఆ గుహ 150 నుండి 200 మంది పట్టే అంత విశాలంగా వున్నది. అక్కడ చేరిన వారందరూ, దగ్గర దగ్గరగా, ఒకరి ప్రక్కన ఒకరు కూర్చొని వున్నారు. నేనూ వాళ్ళతో కూర్చొని నిరీక్షిస్తున్నాను. నేనక్కడ ఒక గంట సేపు నిరీక్షించినా, మాట్లాడే వ్యక్తీ కనిపించలేదు, అలానే అతని మాటలూ వినిపించలేదు. దానితో, సహజంగా విసుగు పుట్టి, చుట్టూ వున్న వారిని "ఎందుకని యింకా ప్రవచనం మొదలు

కాలేదు? ఆ మహాత్ముడు ఎక్కడ?'' అని అడిగాను. నాకు దగ్గరలో, జడలు కట్టిన జుట్టుతో ఒక వృద్ధుడు కూర్చొని వున్నాడు. ఆ తరువాత, అతని పేరు కావ్యకంఠ వాసిష్ఠ గణపతి ముని అని తెలిసింది. వారు చేతిని ఎత్తి, నాతో యిలా అన్నారు. ''గురువు యొక్క మౌనమే అతని మాట. దానితో భక్తులకు సంశయాలే లేకుండా పోతాయి''. అలా అనటంతో ఆశ్చర్య చకితుడనై, ఆ మౌన గురువు ఎవరా అనేది నేను అర్థం చేసుకోలేకపోయాను. అలానే వారి మౌనోపదేశాన్ని కూడా నేను అర్థం చేసుకోలేకపోయాను. అందువల్ల, నేను మళ్ళీ, ''గురువు ఎక్కడ వున్నాడు?'' అని అడిగాను. దానితో వారు, ''గురువు నీకు అత్యంత దగ్గరగా కూర్చున్నారు'' అని సమాధాన మిచ్చారు. అప్పుడు నేను, అక్కడ నాకు దగ్గరగా వున్న వారందరిని కలియ చూచినప్పుడు, వారిలో, సన్నగా, తెల్లని కౌపీనాన్ని ధరించి, ప్రసన్నమైన వదనంతో వున్న ఒక 22 సంవత్సరాల యువకుడిని కనుగొన్నాను. నేను అప్పటికప్పుడు, వారికి దండ ప్రణామములు అర్పించి, మీ పేరు తెలుసుకోవచ్చునా అని అడిగి, వారి యొక్క మౌన భాషను అర్థం చేసుకోవాలని అనుకుంటున్నాను అన్నాను. దానికి వారు, తమ వ్రేలును, హృదయం వైపు చూపించి, మరాఠీ భాషలో, ''దీనిని రమణ మహర్షి అంటారు'' అని చెప్పి, మనోహరంగా నవ్వారు. ఒక్కసారిగా, గొప్ప ఆనందంతో మేల్కొన్నాను. ఈ సంఘటనను, ఎడతెగకుండా నేను చేసిన ప్రార్థనకు సమాధానంగా భావించి, సంతోషించి, దానిని గురించి చింతించడం మొదలుపెట్టాను.

పూణేలో నివసిస్తున్నా, రమణ మహర్షి గొప్పతనాన్ని గురించి మహారాష్ట్రలో అప్పుడు (1942లో) పెద్దగా తెలియదు. అక్కడ వున్న

పెద్ద గ్రంథాలయంలో, పాల్ బ్రంటన్ రచించిన పుస్తకాలు ఒకటో, రెండో వున్నాయి. వాటిని కూడా, చాలా తక్కువ మంది చదివేవారు. మద్రాస్ ప్రావిన్స్‌లో, రామేశ్వరాన్ని దర్శించిన కొద్దిమంది ఉన్నత చదువులు చదువుకున్న క్షేత్రాటకులు, మహర్షిని గురించి విని వుండవచ్చు. కాని, చాలా దూరంలో వున్న వాయి అనే నగరంలో, భగవాన్ గురించి ఎవ్వరికీ తెలియదు. అందువల్ల, నాకు కలిగిన ఈ దర్శనం గురించి ఎవ్వరితోనైనా చర్చించాలంటే యిబ్బందే. పది లేక పన్నెండు రోజులు, నేను ఎంతో ఆత్రుతగా, భగవాన్‌ను గురించి ఏదైనా సమాచారము దొరుకుతుందా అని ఎదురు చూశాను. అన్ని రోజులూ, నేను ప్రార్థిస్తూనే వున్నాను. అలాంటి సమయంలో, అర్థాంతరంగా, ఒకరోజు, పూణేలో నాకు బాగా పరిచయమున్న వ్యక్తి నన్ను కలిసినప్పుడు, నరసింహ సరస్వతి స్వామి వారి ఫొటో నా బల్ల మీద చూసి, అప్పటికప్పుడు ఒక సంఘటనను గుర్తు చేసుకొని, ఈ మధ్య కాలంలోనే నేను తీర్థ యాత్ర కోసం రామేశ్వరం వెళ్లాను. అక్కడ భక్తులు కొంతమంది, శ్రీ రమణ మహర్షి గురించి మాట్లాడుకోవటం విని, వారితో పాటుగా తిరువణ్ణామలై వెళ్లి, ఎంతో ఆనందకరమైన దర్శనాన్ని చేసుకొన్నాను అని చెప్పాడు. అంతేకాదు, భగవాన్ రమణ మహర్షి నరసింహ సరస్వతి వంటి ఒక సిద్ధ పురుషులు (జీవన్ముక్తులు) అని తెలియజేసి, నన్ను కూడా, వారిని ఒక్కసారైనా దర్శించుకొనమని సలహా యిచ్చాడు.

దానితో, ఊహించకుండా, నా స్వప్నం సాకారమైనట్లు అనిపించి, అప్పటికప్పుడు టెలీగ్రాఫిక్ మనీ ఆర్డర్ ద్వారా కొంత

రుసుమును రమణాశ్రమం పంపి, భగవాన్‌కు సంబంధించిన రెండు, మూడు పుస్తకాలను తెప్పించుకున్నాను. వాటిని తొందరగా పొందాలన్న వాంఛ, మరియు నా ఆత్రుత చాలా తీవ్రంగా వున్నది. నాలుగు లేదా ఐదు రోజులలో ఆ పుస్తకాలు వచ్చాయి. నేను వాటిని చదువుదాము అనుకున్న లోపల, నా స్నేహితుడు ఒకరు, వాటిని తీసుకు వెళ్ళాడు. నేను అతనికి ఆ పుస్తకాలను యివ్వవలసి నదిగా లేఖ వ్రాస్తే, అతను వాటిని మరల రమణాశ్రమమునకు ఆర్డర్ చేసి తెప్పించాడు. అవి నాకు ఒక వారం రోజుల తరువాత వచ్చాయి. అవి చదువుతున్నప్పుడు, భగవాన్‌ను తొందరగా దర్శించాలన్న కోరిక మరింత తీవ్రమైనది. నాకున్న జబ్బు వలన, నా శరీరం డస్సిపోయి వున్నా, భగవాన్‌ను దర్శించాలన్న కోరిక తీవ్రంగా వుండటం వలన, నేను ప్రశాంతంగా వుండలేకపోయాను. అటువంటి స్థితిలోనే, నేను రైలు ఎక్కి, మూడో రోజు ఉదయానికి తిరువణ్ణామలై చేరుకొన్నాను. రైల్వే స్టేషన్‌లో, ఒక జట్కా బండిని బాడుగకు తీసుకుని, తెల్లవారు ఝామున 6 గంటలకు శ్రీరమణాశ్రమం చేరుకున్నాను. ఆ జట్కాను నడిపించే వ్యక్తి, భగవాన్ తమ దగ్గరకు వస్తున్నారని నాకు చూపించి చెప్పాడు. దాంతో నా ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. నేనెప్పుడైతే, భగవాన్‌కు దండ ప్రణామములు అర్పించానో, అప్పుడు భగవాన్ నా దగ్గరకు వచ్చి ‘‘మీరు పూణే నుండి వస్తున్నారా? బాగా అలసిపోయినట్లు వున్నారు’’ అని అన్నారు. అది విని, నేను ఆశ్చర్యానికి లోనైనాను. ఎందుకంటే, నేను ఎక్కడి వాడిని అనేది కాని, మరియు ఎప్పుడు వస్తాను అని కాని, ఎప్పుడూ ఆశ్రమానికి ఉత్తరం వ్రాయలేదు. ఆ తరువాత, నేను ఆశ్రమంలో వుండటానికి ఏర్పాట్లు చేశారు.

ఆ రోజు మధ్యాహ్నం, నేను భగవాన్ ఎదురుగా కూర్చున్నప్పుడు, నా ఆరోగ్యం గురించి భగవాన్ అడిగి తెలుసుకున్నారు. నేనప్పుడు, భగవాన్‌తో, నా సయాటికా సమస్యతో మూడేళ్ళ నుండి ఎంత తీవ్రంగా యిబ్బంది పడుతున్నానో, నిద్ర లేని రాత్రులు ఎలా గడుపుతున్నానో, ఆహారం తీసుకోవాలన్న కోరిక కూడా ఎలా తగ్గి పోతున్నదో, మంచి మంచి డాక్టర్లకు చూపిస్తున్నా, యిబ్బందికర స్థితి నుండి అధ్వాన్న స్థితికి నా ఆరోగ్యం ఎలా దిగజారిపోతున్నదో తెలియజేశాను. అదే కాకుండా, నా తండ్రి వృద్ధులైనారని, పిల్లలు యింకా చిన్న వాళ్ళని, నా భార్య నిస్సహాయురాలని, ఈ రోగము నన్ను విపరీతంగా పీడిస్తూనే వున్నా, మా కుటుంబానికి సంబంధించిన వారైన నరసింహ సరస్వతీ స్వామి వారిని నిరంతరంగా ప్రార్థించిన ఫలితంగా, నాకు మీ స్వప్న దర్శనభాగ్యం కలగటంతో నేను యిక్కడికి వచ్చాను అని తెలియజేశాను. నేను నరసింహ సరస్వతి స్వామి వారి చిత్రపటాన్ని భగవాన్ చేతికి అందించాను. అది తీసుకొని నవ్వి, స్వామితో వారికి దివ్యమైన దగ్గర సంబంధం వున్నదని తెలిపారు. ఆ తరువాత, నాతో, అనుగ్రహ పూర్వకంగా “మీరు యిక్కడ ప్రశాంతంగా వుండవచ్చు. మీ జబ్బు నయం చేయలేనిదేమీ కాదు” అని అన్నారు. భగవద్గీత రెండవ అధ్యాయము నుండి ఒక శ్లోకాన్ని (14వ శ్లోకం) చదివి “ఓ కౌంతేయా! విషయేంద్రియ సంయోగము వలన శీతోష్ణములు, సుఖ దుఃఖములు కలుగుచున్నవి. అవి ఉత్పత్తి వినాశనములు, అనిత్యములు. కనుక అర్జునా! వాటిని సహింపుము” అని చెప్పి నన్ను శాంత పరిచారు. దానితో, నేను ఎంతో భారము తొలగిన

వాడినయ్యాను. మూడు లేదా నాలుగు నెలల్లో, భగవాన్ అనుగ్రహంతో సంపూర్ణంగా కోలుకున్నాను.

అప్పటి నుండీ 1950వ సంవత్సరం వరకు, సంవత్సరంలో మూడు లేక నాలుగు సార్లు భగవాన్ దర్శనార్థం వచ్చేవాడిని. దాని వల్ల, భగవాన్‌తో సన్నిహితంగా ఉండేందుకు వీలు కుదిరింది. భగవాన్, నన్ను భౌతికంగాను మరియు ఆధ్యాత్మికంగాను ఉత్తేజితుని గా చేసి, నన్ను, వారి కరుణాపూరిత అనుగ్రహ తరంగాలలో శాశ్వతంగా వుండే విధంగా చేసుకున్నారు. దానిని వర్ణించటానికి నా వద్ద మాటలు లేవు.

టెలిగ్రాం అందటంతో, భగవాన్ మహా సమాధి చెందే రోజున, నేను ఆశ్రమానికి వచ్చాను. ఆ రోజున, ఎందుకో, నాలో భావోద్వేగాలు నా నుండి దూరమైనాయి. కాని, మరుసటి దినము రాత్రి, అందరూ నిద్రపోయిన తరువాత, నేను విచలితమైన మనస్సుతో, భగవాన్‌ను యిక ముందు భౌతికంగా దర్శించలేనని, వారి సన్నిధిలో కలిగే ఆనందాన్ని యిక అనుభవించలేనని అనిపించటంతో, విపరీతంగా ఏడవ సాగాను. అప్పుడు, ఒక్కసారిగా, ఆ నిశి రాత్రిలో, ఎవరిదో అడుగుల సవ్వడి వినిపించసాగింది. ఆహ! చూస్తే భగవాన్! చేతిలో లాంతరు పట్టుకొని వున్నారు. కర్టెన్‌ను తొలగించి, నా దగ్గరకు వచ్చి, మృదు స్వరంతో, మెల్లగా, ప్రేమపూర్వకంగా ‘‘ఓహ్! నువ్వెందుకు ఏడుస్తున్నావు? నేను నీకు యిక్కడనే వున్నానని చెప్పలేదా?’’ అని అనటంతో, నన్ను నేను నియంత్రించుకొని, భగవాన్‌కు దండ ప్రణామములు అర్పించాను. నేను నా తల ఎత్తేటప్పటికి, ఆశ్చర్యంగా, నన్ను వదిలేసి భగవాన్ అదృశ్యులైనారు. రమణ భగవాన్‌కు వేవేల ప్రణామములు.

# ఉద్దీపనము

శ్రీ దుర్గా శ్యామసుందరి

(తమ రచనల ద్వారా అనేకమంది పాశ్చాత్య దేశీయులను భగవాన్ వైపునకు నడిపించిన గొప్ప మేధా సంపన్నుడు, ఆధ్యాత్మిక జిజ్ఞాసువు, ప్రముఖ పాత్రికేయుడు అయినటువంటి పాల్ బ్రంటన్ అసలు పేరు రాఫెల్ హెర్ట్జ్. వీరు బ్రిటిష్ దేశస్థుడు. వారి జీవిత లక్ష్యం, పరమ సత్యాన్ని కనుగొనటం. ఆ శోధనలో భాగంగా వారు భారతదేశంలోని ప్రముఖ యోగులను, సాధువులను కలుస్తూ, కంచి పరమాచార్య వారి ఆదేశం మేరకు 1930లో భగవాన్‌ను దర్శించారు. అనేక సందేహాలతో సతమతమౌతున్న వారికి, భగవాన్ సన్నిధిలో పరమ శాంతి లభించింది. తమ అనుభవాలను In Search of Secret India లో పొందు పరిచారు. భగవాన్ బోధించిన ఆత్మ విచారణా మార్గాన్ని అనుసరిస్తూ, వారి సాధన కొనసాగింది. ఆ సాధనా ఫలితంగా 1963లో వారికి ఆత్మానుభవం కలిగింది. ఆ వివరాలు ఈ వ్యాసంలో....)

ప్రతీ వ్యక్తి, ఒక ఉన్నతమైన చైతన్యస్థితిని పొంది, స్వస్థితిలో సంస్థితమై వుండే అవకాశం కలదన్న వాస్తవానికి, భగవాన్ ఒక తార్కాణం.

బ్రంటన్ శోధనలో మూడు ప్రశ్నలు ముఖ్యమైనవి. అవి 'నేనెవడను?' 'జగత్తు ఏమిటి?' 'నేనెలా జీవించాలి?'. ఆయన భగవాన్ చెప్పిన ఆత్మ విచారణా మార్గాన్ని సంక్షిప్తంగా యిలా చెప్పారు. "నిరంతరం 'నేనెవడను'? అన్న విచారణ కొనసాగించు.

నీ వ్యక్తిత్వాన్ని విశ్లేషించు. ఎక్కడినుండి 'నేను' అనే ఆలోచన మొదలయ్యిందో చూడు. నీ ధ్యానాన్ని అంతర్ముఖత్వం చెయ్యి. ఒక రోజు ఆలోచనా క్రమం నెమ్మదిస్తుంది. లోపల నుండి ఒక స్ఫురణ లేస్తుంది. దానిని అనుసరించు. నీ ఆలోచన ఆపెయ్యి. ఆ స్ఫురణే నిన్ను గమ్యానికి చేరుస్తుంది''.

పాల్ బ్రంటన్ భగవాన్ సందర్శనం గురించి 1971లో యిలా వ్రాశారు.

'భగవాన్ సన్నిధికి నేను వెళ్లి 40 సంవత్సరములు అయ్యింది. ఆ రోజు, వారు, పులిచర్మంతో కప్పబడిన సోఫాలో, కొద్దిగా వాలి కూర్చొని వున్నారు. సహజంగా, దీర్ఘకాల గతిలో జ్ఞాపకాలు మరుగున పడతాయి. కాని, భగవాన్ విషయంలో అలా జరగలేదు. నేను చూసిన వారి వదనము, రూపము, ముఖంలో వ్యక్తమయ్యే భావాలు, పరిసరాలు స్పష్టంగా గుర్తున్నాయి. అన్నింటికన్నా ముఖ్యమైన విషయం, నేను ధ్యానం చేసుకునే సమయంలో, కాంతివంతమైన వారి సన్నిధి అనుభవం, ఆ రోజు ఎలా ఉన్నదో, ఈ రోజుకీ అలానే వున్నది.

మహర్షి ఒక సాధారణమైన వ్యక్తియో, లేక యోగియో అయి వుంటే, వారి గురించి, నాకు యింత శక్తివంతమైన, లోతైన భావన కలిగేది కాదు. పూర్వ, పశ్చిమ దేశాలకు సంబంధించిన అనేకమంది యోగులను నేను ఎరుగుదును. కాని, మహర్షి గూర్చిన అభిప్రాయం పూర్తిగా పక్షపాత రహితము, స్వచ్ఛము. అది, భగవాన్ భక్తులతో సంభాషణల వల్లనూ, మహర్షి జీవిత చరిత్ర చదవటం ద్వారానూ, నా వ్యక్తిగత అనుభవాల వల్లనూ, భగవాన్‌ను క్షుణ్ణంగా పరిశీలించి

నేను ఏర్పరచుకున్న అభిప్రాయము. అదేమంటే, వారు మహోన్నత శక్తికి శుద్ధమైన మార్గము.

ప్రతిరోజు, ముఖ్యంగా సాయంత్రాలలో, భగవాన్ తీవ్ర ధ్యాన స్థితిలో వున్నప్పుడు, ఎవరూ వారితో సంభాషించే సాహసం చేయరు. అక్కడ మౌనమే రాజ్యమేలుతుంది. అంతా పవిత్రత పరచుకుని, ఆశ్చర్యంతో కూడిన పూజ్యభావం కలుగుతుంది. సూర్యాస్తమయం వరకు, ఈ వాతావరణం యిలా కొనసాగుతుంది. కాని, పగటి సమయాలలో భగవాన్ అందరిలాగే సామాన్యులుగా కనిపించే వారు. మాటలకందని దివ్య నాటకమేదో ఆ సాయంత్రాలలో జరుగుతూ వుండేది. ఆ నాటకంలో భగవాన్‌ది ముఖ్య పాత్ర. కాని అంతకంటే విశేషమైనదేదో వున్నది!

చెంగల్పట్టులోని దేవాలయంలో, నేను కంచి పరమాచార్యుల వారిని కలిసి, వారిని ఇంటర్వ్యూ చేశాను. వారినొక వ్యక్తిగతమైన ప్రశ్న అడిగాను. ‘మహర్షి శిష్యులొకరు నన్ను వారి గురువు వద్దకు తీసుకు వెళతానంటున్నారు కాని, నేనెవరిని అడిగినా, మహర్షి ఎవరో తెలియదంటున్నారు. మరి నేను వెళ్ళనా? వద్దా? అని సందిగ్ధంలో వున్నాను’. వెంటనే పరమచార్యుల వారు, నన్ను వెళ్ళమని, అక్కడ నాకు తప్పక శాంతి కలుగుతుందనీ చెప్పారు. భగవాన్ అనుగ్రహంతో, పాల్ బ్రంటన్‌కు, 1963లో చిట్టచివరి ఆధ్యాత్మిక అనుభవం కలిగింది. దానిని గురించి 1979లో తన కుమారుడైన కెన్నెత్.టి.హర్స్ట్ కి ఈ విధంగా తెలియజేశారు.

ఒక రోజున నాకు, అణుబాంబు ప్రేలినట్లు, చైతన్య విస్ఫోటనం జరిగింది. తల పగిలిపోతుందేమోనని అనిపించింది.

రాత్రి సమయంలో, నిద్ర, మెలకువ లేని స్థితి, లోతైన స్తబ్ధత ఏర్పడింది. ధ్యానం చేయాల్సిన అవసరం కనిపించలేదు. భగవద్గీతలో, అందరికీ పగలు జ్ఞానికి రాత్రి, అందరికీ రాత్రి జ్ఞానికి పగలు అని చెప్పారు. అది నిజం. భగవంతుడు నాతోనే, నాలోనే వున్నట్లుగా అనుభవమైంది. అంతే కాదు, నేను మరణించినట్లు, నా లోపలంతా శూన్యం గానూ వున్నది. తరువాత ఒకటిన్నర రోజులు, ఒకటే మనో వేదన. దాని నుండి బయటపడే మార్గం దొరకలేదు. నిస్పృహ, శూన్యతలతో హృదయమంతా నిండిపోయింది. ఎవరిని సహాయమర్థించాలో తెలియదు. ఏ దారీ కన్పించలేదు. నాకుగా నాకు శక్తి లేదు. దుఃఖాన్ని ఆపుకోవటం సాధ్యం కాలేదు. ఈ స్థితిలో అలా మునిగి పోయాను. నా పరిసరాలను కూడా మర్చిపోయాను. నా చుట్టూ మనుష్యులంతా పెంకుల్లాగా (empty shells) వారితో నాకు ఎటువంటి సంబంధం లేనట్లు తోచసాగింది.

హఠాత్తుగా, యిదంతా ఏదో మానవాతీత శక్తి నా అహంకారాన్ని అణిచివేసే ప్రక్రియ అని అర్థమయింది. ఒంటరివాడిని అయి పోయానన్న భయం వీడింది. ఎంతో వినయంతో ప్రార్థించాను. ఏదో కావాలన్న కోరిక లేదు, సహాయం కావాలన్న ప్రార్థన తప్ప. యిలా ఎంత కాలం గడిచిందో తెలియదు. లౌకికమైన విషయాల నుండి విడివడిపోయాను. సహనం చివరి అంచుకు వచ్చింది. ఎంతో భయం. తల తిరిగి స్పృహ కోల్పోయాను. కానీ వెంటనే లేచాను. అప్పుడు నా హృదయంలో చిన్న ఆశాజ్యోతి వెలిగింది. అది పెరిగి పెద్దదయింది. భగవంతుడు నా మొర వింటున్నాడని తోచింది.

నా చుట్టూ వున్నవారంతా యింతకు ముందు కన్నా చాలా సన్నిహితంగా తోచారు. కొన్ని గంటల తరువాత ఒక నమ్మకం కలిగింది. పరిపూర్ణత్వం అనుభవమయింది. క్రొత్తగా జన్మించి నట్లుంది. జ్ఞానోదయం అయింది. భగవంతునితో ఏకతా భావం కలిగింది. పూర్వం అర్థం కానివన్నీ, యిప్పుడు అర్థమవసాగాయి. అహంకారం కరిగిపోయి, ప్రతీ నిమిషం ఆనందం పెరగసాగింది. ఈ నూతన అనుభవం, నాకు ఎప్పటికీ మార్గదర్శకమౌతుందని నమ్మిక కలిగింది.

పూర్వం నేను ఒక స్వాప్నికుడిని. ఊహలలో జీవించేవాడిని. ఇప్పుడు నా స్వభావం మారిపోయింది. ఒక సమతుల్యత ఏర్పడింది. ప్రాక్టికల్‌గా వుంటున్నాను. ఇది వరకు యిష్టం లేని పనులను, యిప్పుడు యిష్టంగానూ, నిర్దుష్టంగానూ చేయగలుగుతున్నాను. కలిగిన జ్ఞానం, కార్యరూపం దాలుస్తోంది. ఏవైనా నిర్ణయాలు తీసుకునే సమయంలో కానీ, ఎవరితోనైనా సంభాషిస్తున్నప్పుడు కానీ, ముందుగా ఆలోచించ వలసిన అవసరం వుండటం లేదు. ఏ సమయంలో ఏది చేయాలో అప్పటికప్పుడే తోస్తోంది. ఎంత చిన్న విషయమైనా, ఖచ్చితంగానూ, సజావుగానూ సాగిపోతోంది. నిరంతరం నేను భగవంతునితో అనుసంధానం కలిగి వుంటున్నాను. ఆయనతో సంభాషిస్తూనో, ప్రార్థిస్తూనో... ఆయన సన్నిధి అనుభవ మౌతోంది. ఈ భావం ఎంత లోతుగా వుండేదంటే, నేనే ఆయనేమో అనిపించేది. నిజమైన (అసలైన) నేను మార్పు లేనిది. అందువలన, భౌతికమైన దేహానికి ఏమి జరిగినా, అసలైన "నేను" ను ఎవరూ బాధించలేరు.

దైవం అతి సన్నిహితము. అదే అసలైన సారము. ఏ సమస్యలు, కష్టాలు వచ్చినా, నేను చెయ్యాల్సిందల్లా 'నాదేమి లేదు, నీ యిష్ట ప్రకారం కానియ్యి' అనటమే. కొంత ఓర్పు వహిస్తే అన్నీ సవ్యంగానే జరుగుతాయి. ఈ దివ్య ఉద్దీపనం (illumination)లో, ఏదైనా ఒక పరిస్థితిని చక్కబెట్టాలని అనిపిస్తే, ఒక యింద్రజాలము వలె, వెంటనే ఆ పని జరిగిపోయేది, చాలా విషయాలలో. ఉదాహరణకు, ఏదైనా ఒక వస్తువు కావాలని అనిపిస్తే, అది వెంటనే సమకూరేది. ఎవరైనా యిద్దరి మధ్య సయోధ్యత లేకపోతే, నేను ప్రేమతో, వారి మధ్య స్నేహభావం కల్గించ గలిగాను.

ప్రపంచ నాటకంలో నటుడిగా వున్న నేను, ఏదైనా కావాలంటే దానిని భగవంతుని ముందు పెట్టి 'నీ ఆజ్ఞ అయితే యీ కోరికను తీర్చు' అని అడిగేవాడిని. ఆయన ఆజ్ఞ మేరకు అవి అనుకూలమయినా, దానిమీద ఎటువంటి మమకారము వుండకూడదు. జరిగినా, జరగకపోయినా, దైవానుగ్రహమే అనుకోవాలి. నాకు అన్నింటికన్నా ముఖ్యమైనది, భగవంతునితో నిరంతరము అనుసంధానంలో వుండటము. దానిముందు అన్ని కోరికలు అల్పమైనవే. అలాగే, నిత్యావసరాలు వాటంతట అవే తీరిపోయేవి. ఉదాహరణకు, ఒక ముఖ్యమైన ప్రయాణానికి అవసరమైన ధనం లేదు. కానీ, ఎవరినీ అడుగలేదు. ఒకరు బహుమతి రూపంలో కావలసిన ధనం యిచ్చారు. అలా అవసరాలన్నీ తీర్చబడతాయి. బైబిల్ చెప్పిన అర్థం అవగత మయింది. 'దేవుడు రక్షకుడు, ఆయనను నేనేమీ కోరను'.

*(సశేషం)*

# గణపతిని రక్షించిన "భైరవి"

శ్రీమతి రేణుక అయ్యల సోమయాజుల

భవతి పరావాక్ భైరవ్యాఖ్యా పశ్యంతి సా కథితా తారా ।

రసనిధి మాత్తా జిహ్వారంగం మాతంగీతి ప్రథితాసేయం ॥

(మూలాధార చక్రమునందు వాక్కులలో నాల్గవదిగా చెప్పబడు పరావాక్కు త్రిపురభైరవి నామమున గలదు. పశ్యంతి రూపమున తార, వైఖరి రూపమున మాతంగియే మణిపూరక చక్రం, జిహ్వాలందు వెలుగుచున్నది).

'భ' అంటే భరణం (భరించుట), 'ర' అంటే రక్షణం, 'వ' అంటే ప్రళయం. అనగా మహాకర్తయైన ఈశ్వరుడు, ఈ సృష్టిని భరిస్తున్నాడు, రక్షిస్తున్నాడు, లయం చేస్తున్నాడు. ఇలా మూడు కార్యాలను చేసేవాడుగా అతడు 'భైరవు'డయ్యాడు. అతని అర్ధాంగి 'భైరవి'.

వాక్కునకు మూలము మౌనము. అందు ఉత్పాదక దశలో ఉంటుంది శబ్దము. ఆ శబ్దాన్ని పరావాక్కు అంటారు. భైరవి ప్రజ్వలితం అయినప్పుడు, ఈ వాక్కు ప్రస్ఫుటం అవుతుంది. కాబట్టి ఆమెకు తారతో సంబంధం కలదు. తార పరావాక్కయిన భైరవి యొక్క పశ్యంతి రూపం.

శరీరంలో ఆమె(భైరవి), మూలాధారంలో వుంటుంది. ఈ మూలాధార పద్మానికి నాలుగు దళాలుంటాయంటారు. దళాల మధ్య కర్ణిక లోపల కులకుండం అనే బిందువు వుంటుంది. దానిపై

కుండలినీ శక్తి నిద్రాణమై వుంటుంది. సాధకులు ఉపాసన ద్వారా ఈ శక్తిని జాగృతం చేస్తారు. దేవికి ప్రధానమైన నివాస స్థలం ఇది.

భైరవి రుద్రమూర్తి అని కాళికా దేవితో సరిపోలుస్తారు. ఆమె రౌద్రం, తామసం(అజ్ఞానం) పైన గాని, వ్యక్తి పైన గాదు. ఆమె, సృష్టి, స్థితి, లయ కర్మ అనడానికి చిహ్నం ఇది. 'కాళి' అంటే మహిమ గలది అని అర్థం. భైరవి కూడా మహిమ గలదే కదా! కావున వారికి తాదాత్మ్యం ఏర్పడింది.

సుందరి వలెనే భైరవి కూడా వాగ్భవ కూటము, కామరాజ కూటము, శక్తి కూటము అని మూడు వర్గాలుగా, మూడు మంత్రాలున్నాయి. ఈ విద్య మోక్షమునిచ్చును. "జాత వేదసే" ఇత్యాది త్రిష్టుప్ మంత్రములచే, భైరవిని, కష్టములు దాటగోరువారు ఉపాసించ వలయును. విద్య, జ్ఞానములు కోరువారు కూడా ఉపాసించవచ్చును.

గణపతిమునిని రక్షించినది కూడా ఈ భైరవి విద్యనే. అరుణాచలం వచ్చిన క్రొత్తలో, గణపతికి, తమ్ముడైన శివరామునికి, భోజనం దొరకటం కొద్దిగా కష్టమయ్యేది. ఎలాగో ఆ గడప, ఈ గడప త్రొక్కితే పగటిపూట భోజనం లభించేది. రాత్రిపూట ఉపవాసమే. ఒక వారం రోజులు ఒంటిపూట భోజనంతో కాలం వెళ్ళబుచ్చారు. ఇక తట్టుకోలేక, శివరాముడు అన్నతో, "అన్నా! మనం ఇల్లు వదిలి చాలాకాలమైనది. నాన్నగారు మనకై ఎదురుచూస్తూ వుంటారు. ఇంటికి పోదాము" అన్నాడు.

గణపతికి అరుణాచలం వదలాలని లేదు. అమ్మ అతనికి ఒకపరికొకపరి వయ్యారమై కనిపించి దర్శనమిస్తోంది. తమ్ముని జూచి "నాకు ఈ క్షేత్రము వదిలి రావాలని లేదు. ఏదియో దైవికమైన శక్తి నన్నీ చోటుకు రప్పించినది. నీవు ఇంటికి వెడలుము" అనెను.

అరుణాచలమందే ఉండవలయుననిన ఏదైనా వృత్తి చేపట్ట వలయును. వార భోజనములతో అట్టే రోజులు గడుపుట కష్టము. ఐతే తనకి వృత్తి నిచ్చేదెవరు? ఇలా తలచిన గణపతి కొండని చూశాడు. అందు ఈశుని రూపం కనిపించిందతనికి. "అరుణాచలా! అనామయ పదమునిత్తురని అందరూ నిన్ను నమ్మి ఇచ్చటికి వత్తురు. ఒకపూటకు భోజన మీయలేని ప్రభువై వున్నావు, నీవు అనామయ పదమును ఇచ్చెదవా?" ఇట్లు తలచి పరిహాసముగా-

వృత్తి దాస విముఖేన కిం త్వయా దీయతే నిజమనామయం పదం?

కిం దదాతి హర! సర్వసమర్పణం విణ్ణిశా శకల దాన దుర్మనాః?

('ఓ హరా! వృత్తినిచ్చుటకే విముఖుడవైన నీచే అనామయ పదమీయబడునా? పసుపుకొమ్ము నిచ్చుటకు లోభియైన వైశ్యుడు అంగణమును అడిగినచో ఇచ్చునా?') అని నిందాస్తుతి గావించెను. "అరెరే! ఈశుని దూషించుచున్నావా? నీవు ఏదైనా యాచించిన కదా అతడిచ్చుటకు. నీవు తలంపగనే హేరంబుడు భోజనమిడ లేదా! అడుగక ఇచ్చెడి దాతయతడు. అడిగి చూడుము" అని అంతర్వాణి పలికినది. ఇచ్చి పుచ్చుకొనుట కవి లక్షణము. కావున ఈశునికై శ్లోకములతో గూర్చిన సుమమాలను సమర్పించ నెంచి,

గణపతి తమ్మునితో ఇట్లనెను. "మరికొద్ది రోజులుండి దసరా వేడుకలు జూచుకొని వెళ్లిపోవుదుము."

మర్నాటి సాయం సమయానికి 36 శ్లోక పుష్పములు అతని కలమున జనించి వికసించినవి. వాటిని దోసిట గ్రహించి, తమ్ముని‌తో బాటు ఆలయం చేరాడతడు. నందీశ్వరుని ముంగిట నిలిచాడు. ఎదురుగా స్వామి లింగము స్వచ్ఛముగా కనిపించు చుండెను. ప్రభువునకు నమస్కరించి ఇరువురు కండ్లు మూసుకొనిరి. గణపతి తన మధుర కంఠముతో శ్లోకములను గానము చేయ నారంభించెను.

అరుణాచల రూపోనః కరుణా వరుణాలయః ।
భువనాధిపతిః కశ్చిదవనాయ ప్రకల్ప్యతామ్ ॥
ఇహాలంకార మాధుర్యధ్వనయః సుతవానవా ।
ఏకోనమధ్వనిః శంభోరస్యాదాతుం విదాంమనః ॥
అలంక్రియంతాం చిత్రారైః ప్రాచాంవాచో విపశ్చితామ్ ।
యశ ఏవ మహేశస్య భాషయా మధుభూషణమ్ ॥

ఇలా ఒక్కొక్క పుష్పము శివుని పాదములకు సమర్పిత మౌతున్నది. అన్నదమ్ములిరువురు శక్తి పరవశులయ్యారు. వారి కండ్ల యందు కన్నీరు ధారా ప్రవాహమైంది. కావ్యకంఠుని మధుర గానం ఆలయమందు ప్రతిధ్వనించింది. కోవెలకు వచ్చిన వారందరూ ఆ గానమునకు ఆకర్షితులయ్యారు. అందరూ గణపతి, శివరాముల చుట్టూ నిల్చున్నారు. కావ్యకంఠుని వాణి, గిరిపై గల

మునీశ్వరులను గూడ కదిల్చివైచినది. ఎందరో సన్యాసులు, యోగులు, యతులు అచ్చటికి వచ్చినారు. ఒక గంట ఇలా ప్రార్థన ముగించుకొని, బసకి చేరారు శివరామ గణపతులు.

మర్నాటినుండి వారికి భోజనమునకై ఇబ్బంది కలుగలేదు. పురప్రజలు ప్రేమతో వారిని పిలిచి భోజనము పెట్టుచుండిరి. ప్రతిదినము గణపతి తాను వ్రాసిన శ్లోకరాజములను ఆలయమందు అరుణేశునకు వినిపించుచుండెను. ప్రతిదినము అదే సమయమునకు, పామరులు, భక్తులు, కవులు, పండితులు కావ్యకంఠుని గానము వినుటకై వచ్చుచుండెడివారు. అట్లు వచ్చెడి యతీంద్రులలో ముఖ్యులు, శేషాద్రిస్వామి మరియు మౌనస్వామి (రమణ మహర్షి).

గణపతి యొక్క రచనా చమత్కృతి, భావపోషణ, శైలి, సరళత్వము ఇత్యాదులు పండితులను, కవులను ఆకర్షించినవి. అతడొక మహాకవి అన్న విషయము వారికి తెలిసినది.

ఈ విధముగా నెల దినముల పాటు ఆలయమునందు ''హర సహస్ర'' స్తుతిని గావించిన గణపతి, చివరి శ్లోకములను గూడ అరుణేశునకు చదివి వినిపించి, అన్నింటినీ కూర్చిన హరసహస్ర సుమమాలతో ప్రభువును అలంకరించెను. గణపతి ముని పాండిత్యమును మెచ్చిన పుర ప్రముఖులు, అతనికి సంస్కృత పాఠశాల యందు అధ్యాపక వృత్తి నిచ్చిరి.

ఓం నమో భగవతే శ్రీ రమణాయ.

# శ్రీరమణ మహర్షి యొక్క భక్తాగ్రేసరులు

# శ్రీ రాఘవాచారియార్

శ్రీమతి మల్లాది ఫణిమాల

శ్రీ రాఘవాచారియార్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్మెంట్లో సూపర్వైజర్ హోదాలో పనిచేసేవారు. వారు తిరువణ్ణామలైలోనే నివసించేవారు. తరచూ శ్రీ రమణులను దర్శించుకునే వారు కూడా. సర్వాంత ర్యామియై, భక్త హృదయ సింహాసనారూఢులై విరాజిల్లే శ్రీ రమణ మహర్షుల వారి దివ్య సన్నిధిలో తన్మయులైన పుణ్యవరేణ్యులలో శ్రీ రాఘవాచారియార్ ఒకరు.

శ్రీ రమణులను దర్శించుకున్న ప్రతిసారి, వారి చుట్టూ ఎందరో భక్తులు ఉండడం వలన, శ్రీరమణులతో ఏకాంతంగా మాట్లాడాలన్న కోరిక శ్రీ రాఘవాచారియార్ గారికి ఉన్నప్పటికీ, అది అంత తేలికగా నెరవేరలేదు. ఒక రోజు మాత్రం, శ్రీ రమణులను మూడు ప్రశ్నలు అడుగుదామన్న గట్టి సంకల్పంతో వారి వద్దకు వెళ్లారు రాఘవాచారియార్ గారు. అందులో మొట్టమొదటిది, ఎవరూ లేని ఏకాంతంలో మీతో సంభాషించే అవకాశాన్ని మీరు నాకు అనుగ్రహించగలరా... రెండవది, నేను థియొసాఫికల్ సొసైటీ సభ్యుణ్ణి. ఆ సంస్థ గురించి మీ అభిప్రాయము నాకు తెలియజేయ గలరు. మూడవది, నేను అర్హత ఉన్న భక్తుడినే అయితే, మీ నిజ స్వరూపాన్ని నాకు కృప

చేయగలరా... ఈ విధంగా సంకల్పించుకుని, మహర్షిని సమీపించిన తరుణంలో ఏం జరిగిందో చూద్దాం!

శ్రీ రాఘవాచారియార్ శ్రీ రమణుల ఎదుట నిలబడి వారికి సాష్టాంగ నమస్కారం చేసేటప్పటికి, రమణుల చుట్టూ దాదాపు 30 మందికి పైగా భక్తులు ఉన్నారు. ఏకాంతంలో శ్రీ రమణులతో మాట్లాడే అవకాశాన్ని అనుగ్రహంగా పొందాలనుకున్న రాఘవాచారి గారు, వారి కోరిక ఏ విధంగా తీరుతుందోనని ఆలోచించే లోపే, అక్కడి నుండి క్రమేపి భక్తులంతా లేచి వెళ్ళిపోయారు! అందరూ వెళ్లిపోవడం వల్ల, రాఘవాచారి గారు ఒక్కరే అక్కడ మిగిలారు. ఈ విధంగా వారి మొదటి ప్రశ్నకి శ్రీ రమణులు సమాధానం అనుగ్రహించారు. తరువాత, శ్రీ రమణులు తమంతట తామే, రాఘవాచారి గారి చేతిలో ఉన్న పుస్తకాన్ని, ‘‘ఇది భగవద్గీతేనా?’’ అని అడిగి మరీ తీసుకుని, రాఘవాచారి గారు, ‘‘మీరు థియొసాఫికల్ సొసైటీ సభ్యులా?’’ అని కూడా అడిగారు. శ్రీ రమణుల ప్రశ్నకి రాఘవాచారి గారు సమాధానం ఇవ్వకపూర్వమే, ‘‘ఆ సొసైటీ బహు చక్కటి పనులు చేస్తోంది!’’ అన్నారు. మరి ఈ రకంగా, వారి రెండవ ప్రశ్నకి కూడా గురు రమణులు సమాధానమిచ్చారు.

ఇక, రాఘవాచారి గారు మూడవ సమాధానం కోసం ఎంతో ఆత్రుతతో ఎదురుచూడసాగారు. కాసేపు గడిచాక, ‘‘అర్జునుడు శ్రీకృష్ణ భగవానుని నిజస్వరూప దర్శనాన్ని కోరినట్లు, నేను కూడా మీ నిజరూప దర్శనాన్ని కోరుతున్నాను, స్వామి! అర్హుడనయితే

మీ నిజరూప దర్శనాన్ని నాకు అనుగ్రహించండి" అని రాఘవాచారి అన్నారు. అప్పుడు రమణులు, ఒక తిన్నెపై కూర్చుని ఉన్నారు. పక్కన ఉన్న గోడ మీద, శ్రీ దక్షిణామూర్తి పటం ఎంతో అందంగా చిత్రించబడి ఉంది. ఎప్పటిలాగే, శ్రీరమణులు రాఘవాచారియార్ కళ్ళలోకి చూస్తూ కూర్చున్నారు. రాఘవాచారి గారు కూడా శ్రీ రమణుల కళ్ళలోకి తదేకంగా చూస్తూనే ఉన్నారు. క్రమేపి, శ్రీ రమణుల దేహము, శ్రీ దక్షిణామూర్తి చిత్రము, వారి కళ్ళ ముందు నుండి అంతర్థానమైపోయాయి! రాఘవాచారి ఎదుట అంతా శూన్యం.... ఆశ్చర్యమేమిటంటే, దక్షిణామూర్తి పటం చిత్రీకరించబడి ఉన్న గోడ కూడా మాయమైపోయింది. కాసేపు అలా గడిచిన తర్వాత, రాఘవాచారియార్ కళ్ళ ఎదుట తెల్లటి మేఘము, రేఖా మాత్రంగా శ్రీ రమణులు, మరియు శ్రీ దక్షిణామూర్తి దర్శనమిచ్చారు. క్రమేపి, వారి ముఖం, అంటే కళ్ళు, ముక్కు ఇతర వివరాలన్నీ గీతల వలె ఏర్పడ్డాయి. మెల్లగా స్వామి రూపము, శ్రీ దక్షిణామూర్తి రూపము, ఎంతో కాంతివంతంగా, తేజోమయంగా కనబడ్డాయి. ఆ తేజస్సు భరించలేని రాఘవాచారి, కళ్ళు మూసేసు కున్నారు. మరి కొంత సేపటికి వారు కళ్ళు తెరిచారు. శ్రీ రమణులు, మరియు శ్రీ దక్షిణామూర్తి యథాప్రకారం కనబడ్డారు. శ్రీ రమణులకు సాష్టాంగ నమస్కారం చేసి రాఘవాచారి గారు తిరిగి వెళ్ళిపోయారు.

ఈ సంఘటన రాఘవాచారి గారిని ఎంతో ప్రభావితం చేసింది. కానీ, ఇది జరిగాక ఎన్నో రోజులు వారు మహర్షి వద్దకు వెళ్లలేదు.

కొంతకాలం గడిచాక, శ్రీ రమణుల వద్దకు వెళ్లి, వారికి ఈ సంఘటన వివరించి, అంతరార్థం ఏమిటో దయచేసి చెప్పమని, రాఘవాచారి రమణులను కోరారు. శ్రీ రమణులు చక్కటి మందహాసాన్ని వేలార్చి, "నా రూపాన్ని చూడాలనుకున్నావు! కానీ నా అంతర్ధానాన్ని చూశావు! మరి నేను రూపరహితుడను కదూ.... కావ్యకంఠ గణపతిమునికి కూడా సరిగ్గా ఇటువంటి అనుభవమే అయింది. వారిని అడిగి చూడు", అన్నారు.

రాఘవాచారియార్ కావ్యకంఠుల వారిని కలిసినప్పటికీ, ఈ విషయం మాత్రం అడగలేదు. సమ్మోహనపరిచే శ్రీ రమణుల చిరునవ్వు, ప్రకాశించే వారి నేత్రాలు, మధురమైన గళము, వెన్నెల వంటి వారి మందహాసము, అన్నిటినీ మించి వారి కృపా కటాక్ష వీక్షణము... ఇవన్నీ అనన్యసామాన్యం అని గ్రహించిన రాఘవాచారి జీవితం ధన్యం. ఇలా రాఘవాచారి తరచూ శ్రీ రమణుల వద్దకు వెళుతూనే ఉండేవారు. అయితే వారి భార్యకి, తల్లికి, అతను సంసారాన్ని మరచి సన్న్యాసం స్వీకరిస్తారేమో నన్న భయం పట్టి పీడిస్తూ ఉండేది. వారిరువురూ మహర్షి వద్దకు వెళ్లి తమ భయాన్ని వెళ్లబుచ్చుకున్నారు. ఆ సందర్భంలో శ్రీ రమణులు, రాఘవాచారిని మందలించి, తగిన అభ్యాసము, నిష్ఠ లేకుండా సన్న్యాసాశ్రమం చేపట్టటం ప్రమాదకరమని సూచించారు. ఇలా, శ్రీ రాఘవాచారి గారి జీవితంలో ప్రతి ఘట్టం, శ్రీ రమణుల అపార కరుణకు నిదర్శనం.

******

# Why did God Choose Prabhupada and Vivekananda?

Dr K Subrahmanian

Bhagavan says that spiritual progress is a state beyond the mind. Therefore, when we feel that we are not making any progress, we should not become depressed because we are using our mind to understand something which is beyond the mind. Furthermore, we expect this progress to be gradual, but we know from the lives of saints and sages that it is not always so. The progress may be like the break of dawn – it is dark for a while, and then suddenly, there's light! When we take a candle into a room that has been dark for twenty, forty or even a hundred years, the darkness of the room doesn't disappear gradually, it disappears immediately. Light replaces darkness instantly. Similarly, if God chooses to bring the candle of *jnana* into us, the darkness in our mind will be replaced by light immediately. When will this happen? It will happen when we least expect it – it will happen when God chooses us for a purpose.

Take for example, Prabhupada, the founder of the Krishna Consciousness movement. He worked as a medical representative in India for many years, when suddenly at the age of 50, he became disgusted with his way of life. He started thinking more and more about Lord Krishna; when he translated the *Bhagavata* into English, he asked a few business people if they could get it printed. Impressed by his sincerity, one of them did, and for the next few years, Prabhupada went from house to house trying to sell copies of his book. A few years later, at the

age of sixty or so, he had the urge to spread the message of Krishna in the US and other western countries. He approached a businessman and requested that he be sent to the US. The businessman replied, "I will send you. But what is it that you can do? You are sixty!" Prabhupada replied, "I don't want to do anything; the Lord is urging me to go abroad before this body falls." Since the businessman did not want to spend too much money, he put Prabhupada on a cargo ship, and sent him.

A few weeks later, Prabhupada reached the US, and soon began talking about the *Bhagavata*. When he spoke about Krishna, the Lord seemed to take possession of him! Although not a powerful speaker, due to God's grace, he managed to win over quite a few people. Americans were impressed with what he had to say, and within five years, the Krishna Consciousness movement, which he started in 1966, became a global phenomenon. Many rich people, including the granddaughter of Ford motors, a young woman of 35, gave up everything and joined the movement. American women, dressed in saris, and men, in dhothis, got up at four in the morning to milk cows and worship them. This was in a place that snowed in winter! They had *goshalas*, and fed people vegetarian food. It was amazing!

Prabhupada was not a highly educated person, and yet he managed to win the hearts of people and start a big movement. How did he manage it? How did it happen? It happened because of Lord Krishna's grace – he had taken possession of him. In Los Angeles, *bhakti vedanta* Prabhupada led a simple life. He would eat from a leaf, and when he had finished, there would be a mad rush

